ఈనాడు ప్రతిభ
హైదరాబాద్ గురువారం జూన్ 16, 2022
13
pratibha.eenadu.net/eenadupratibha.net

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

ఆస్క్ ది ఎక్స్‌పర్ట్

నేను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి 47 శాతం మార్కులతో బీకాం పాస్ అయ్యాను. టీఎస్‌పీఎస్సీ గ్రూప్స్, ఎస్ఐ ఉద్యోగ పరీక్షలు రాయడానికి అర్హత ఉంటుందా? – కాసర్ల నాగరాజు

జ: డిగ్రీ ఉత్తీర్ణత సరిపోతుంది. టీఎస్‌పీఎస్సీ గ్రూప్స్, ఎస్ఐ ఉద్యోగ పరీక్షలు రాసుకోవడానికి మీకు అర్హత ఉంది.

పోలీస్ కానిస్టేబుల్స్ దరఖాస్తులోని తప్పులను సరిదిద్దుకోవడానికి ఎడిట్ ఆప్షన్ ఏమైనా ఇస్తారా? – సాయి కుమార్

జ: అధికారికంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అంశం. అభ్యర్థులు ఎక్కువమంది కోరితే ఎడిట్ ఆప్షన్ ఇవ్వొచ్చు.

నా ఆధార్ కార్డు భర్త ఇంటి పేరుతో ఉంది. సర్టిఫికెట్లు అన్నీ మా నాన్న ఇంటిపేరుతో ఉన్నాయి. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. ఇంటిపేరులో తేడా వల్ల ఏదైనా సమస్య ఉంటుందా? – సునీత ముదిగొండ

జ: సర్టిఫికెట్లలో ఉన్న ఇంటి పేరునే ఉద్యోగ పరీక్షలకు పరిగణనలోకి తీసుకుంటారు. భర్త ఇంటిపేరు తీసుకోరు. ఆధార్‌కార్డులో కూడా మీ తండ్రి ఇంటి పేరునే పెట్టుకుంటే సరిపోతుంది.

మీ సందేహాలను పోస్ట్ చేయడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
help@eenadupratibha.net

ప్రిపరేషన్ టెక్నిక్

జాగ్రఫీ అధ్యయనం చేసేటప్పుడు సిలబస్ ప్రకారం సహజ వనరులు, ముఖ్యమైన ఎగుమతులు, దిగుమతులు వంటి వాటిని వాటి ప్రాదేశిక పంపిణీల ప్రకారం నోట్ చేసి పెట్టుకుంటే తేలిగ్గా రివిజన్ చేసుకోవచ్చు

శోధించు.. స్థాపించు.. సంపద సృష్టించు!

వనరుల సద్వినియోగం, ఉద్యోగావకాశాల కల్పన, సంపద సృష్టి పారిశ్రామికీకరణ పరమ లక్ష్యాలు. వాటి సాధనలో తెలంగాణ చక్కటి పురోగతిని సాధిస్తోంది. టీఎస్-ఐపాస్, టీ-హబ్ వంటి విధానాలను రూపొందించి సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది, అభివృద్ధి చేస్తోంది, పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠం చేస్తోంది. పరిశోధనలు చేసి, స్టార్టప్‌లు, పరిశ్రమలు స్థాపించి, సంపదను వృద్ధిచేసి ప్రగతి పథంలో పయనిస్తోంది

పారిశ్రామిక రంగం

తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో పారిశ్రామిక రంగానికి చాలా ప్రాధాన్యం ఉంది. బలమైన పారిశ్రామిక రంగం ఉన్న రాష్ట్రాలు అధిక ఆర్థికవృద్ధి, ఆర్థికాభివృద్ధిని సాధిస్తాయి. ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయాన్ని పెంచడంలో పరిశ్రమలు ప్రముఖపాత్ర పోషిస్తాయి. తెలంగాణ ఎన్నో భారీ పరిశ్రమలకు నిలయం. సిమెంటు, బల్క్‌డ్రగ్స్, ఔషధాలు, టెక్స్‌టైల్స్, ఆగ్రోప్రాసెసింగ్, ఖనిజ ఆధారిత పరిశ్రమలు, కోళ్ల పెంపకం లాంటివి ఇక్కడ ప్రధాన పరిశ్రమలు. ఐటీ ఆధారిత పరిశ్రమలు ఎంతోమందికి ఉపాధిని కల్పించడంతో పాటు ఇతర దేశాలకు సేవలందిస్తున్నాయి. విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూరుస్తున్నాయి.

మరిన్ని వివరాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రసిద్ధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు

బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఈసీఐఎల్, డిఫెన్స్ రిసెర్చ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ (డీఆర్‌డీఎల్), ఐఐసీటీ, సీసీఎంబీ, నేషనల్ రిసెర్చ్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ), సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ), ఎన్ఐఆర్‌డీ, ఇక్రిశాట్ తదితర ప్రసిద్ధ సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి.

https://tinyurl.com/2uzzksf5

పరిశ్రమల పరంగా తెలంగాణ దేశంలో ఆరో స్థానంలో, పరిశ్రమల నుంచి సమకూరే స్థూల విలువ ఆధారిత అంశాలను అనుసరించి ఎనిమిదో స్థానంలో ఉంది. విదేశీ, దేశీయ పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రాన్ని మలచడానికి ప్రోత్సాహకరమైన పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు; ఎస్సీ, ఎస్టీలకు అనుకూలమైన సాధికారిక వాతావరణాన్ని సృష్టించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

తెలంగాణ ప్రభుత్వ సామాజిక ఆర్థిక దృక్పథం (సోషియో ఎకనామిక్ అవుట్‌లుక్) - 2022 నివేదిక ప్రకారం రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో పరిశ్రమల రంగం వాటా 20.40 శాతంగా ఉంది. ఈ రంగంలో రాష్ట్రంలో 18.23 శాతం వయోజనులు అంటే 25,69,134 మంది ఉపాధి పొందుతున్నారు. ఎక్కువ మందికి నిర్మాణ, తయారీ రంగాలు ఉపాధి కల్పిస్తున్నాయి. 2019 - 20లో రాష్ట్రంలో తయారీ రంగంలో 58.6%, నిర్మాణ రంగంలో 36.3% మంది ఉపాధి పొందారు (15 - 59 మధ్య వయసు ఉన్నవారు).

రాష్ట్రంలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (2021-22)

(2011–12 స్థిర ధరల పద్ధ)

ఏప్రిల్	– 153.3
మే	– 154
జూన్	– 181.9
జులై	– 158.9
ఆగస్టు	– 152.4
సెప్టెంబరు	– 156
అక్టోబరు	– 175.8
నవంబరు	– 155.4

రాష్ట్ర స్థూల అదనపు విలువలో పరిశ్రమల రంగం వాటా, వృద్ధిరేటు (ప్రస్తుత ధరల వద్ద)

సంవత్సరం	పరిశ్రమల రంగం వాటా (%)	పారిశ్రామిక రంగం వృద్ధిరేటు(%)
2014 - 15	22.4	1.5
2015 - 16	23.6	19.8
2016 - 17	21.5	3.4
2017 - 18	22.2	16.6
2018 - 19	23.5	20.9
2019 - 20	20.7	(-)1.6
2020 - 21	19.8	(-)1.7
2021 - 22	20.4	20.2

ఆధారం: సోషియో ఎకనమిక్ అవుట్‌లుక్ - 2022, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

పారిశ్రామిక ఉత్పత్తి సూచీ

పారిశ్రామిక వృద్ధిని కొలిచేందుకు పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (IIP) ఒక కొలబద్ద లాంటిది. పరిశ్రమల రంగంలో నిర్దిష్ట కాలంలో అంతకుముందు సంవత్సరపు అదే నిర్దిష్ట కాలంతో పోలుస్తూ ఉత్పత్తిలో వచ్చిన సాపేక్ష మార్పును ఈ సూచీ తెలియజేస్తుంది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీని తయారీరంగ మైనింగ్, క్వారీయింగ్, విద్యుచ్ఛక్తికి సంబంధించిన ఎంపిక చేసిన యూనిట్ల నుంచి డేటా సేకరించి, నెలవారీగా అంచనా వేస్తారు. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (GSDP)లో పారిశ్రామిక రంగం వాటాను అంచనా వేయడం ఈ సూచీ ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీని 2011 - 12 ఆధార సంవత్సరంగా సంకలనం చేస్తున్నారు.

పరిశ్రమల వార్షిక సర్వే: రాష్ట్రంలో పారిశ్రామిక గణాంకాలకు ముఖ్యమైన ఆధారం పరిశ్రమల వార్షిక సర్వే. రాష్ట్ర ఆదాయానికి మొత్తం తయారీరంగం పరిశ్రమలతో పాటు ఒక్కో పరిశ్రమ అందించిన వాటాను అంచనా వేయడం దీని ఉద్దేశం. మొత్తం పరిశ్రమల రంగంతో పాటు ఒక్కో పరిశ్రమ నిర్మాణాన్ని క్రమానుగతంగా అధ్యయనం చేయడం, పరిశ్రమలను ప్రభావితం చేసే కారకాలను విశ్లేషించడం, విధాన రూపకల్పనకు అవసరమైన సమగ్ర వాస్తవిక క్రమానుగత ప్రాతిపదికను అందించడం ఈ సర్వే లక్ష్యాలు.

నూతన పారిశ్రామిక విధానం - 2014

తెలంగాణలో ఆర్థిక వృద్ధికి, అభివృద్ధికి అనుసరించాల్సిన కీలక వ్యూహం పారిశ్రామికీకరణ. యువతరానికి ఉద్యోగ కల్పన, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, అందుబాటులో ఉన్న వనరులను ఆదర్శవంతంగా వినియోగించుకోవడం ద్వారా వృద్ధి అవకాశాలను పెంచడం, తద్వారా ప్రతి ఇంట్లో సంపదను సృష్టించడం లాంటి అంశాల్లో ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం మీద భారీ ఆకాంక్షలు ఉన్నాయి. తెలంగాణ ప్రజల్లో నెలకొన్న ఈ ఆశలను నెరవేర్చే సామర్థ్యం పారిశ్రామికీకరణకు ఉంది. దీనిలో భాగంగా ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం - 2014ను ప్రవేశపెట్టింది. నవ్యావిష్కరణల కోసం పరిశోధన, పరిశ్రమల కోసం నవ్యావిష్కరణ, సంపద కోసం పరిశ్రమలు అనేది తెలంగాణ పారిశ్రామికీకరణ విషయంలో ప్రభుత్వ దార్శనిక దృక్పథం. 'ఇన్నోవేట్, ఇన్‌క్యుబేట్, ఇన్‌కార్పొరేట్. (నవ్యావిష్కరణలు చేయండి, నూతన పరిశ్రమలకు శ్రీకారం చుట్టండి, సువ్యవస్థిత పరిశ్రమగా అవతరించండి)' అనే నినాదం పారిశ్రామిక విధానం నిర్మాణానికి చోదకశక్తి. కరచాలనం చేసుకున్నంత సులువుగా వ్యాపారం సాగించే నియంత్రణ వాతావరణాన్ని కల్పించడమే ఈ విధానం ఉద్దేశం. నవ్యావిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం తెలంగాణలో పరిశ్రమలను ముందుకు నడిపిస్తున్నాయి.

లక్ష్యాలు: ✦ ప్రస్తుతం ఉన్న పరిశ్రమలను మరింత పోటీ పడే విధంగా తీర్చిదిద్దడం. ✦ పారిశ్రామిక రంగంలోకి కొత్తగా అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం. ✦ పట్టణ, గ్రామీణ యువతరానికి ఉపాధి అవకాశాలు సృష్టించే విధంగా ఉత్పాదక రంగాలపై దృష్టి కేంద్రీకరించడం. ✦ అత్యంత పోటీ ధరలకు అత్యున్నత స్థాయి వస్తువులను ఉత్పత్తి చేయడం. ✦ 'మేడ్ ఇన్ తెలంగాణ, మేడ్ ఇన్ ఇండియా'ను అంతర్జాతీయ స్థాయిలో ఒక బ్రాండ్‌గా నెలకొల్పడం.

పారిశ్రామిక విధానంలో అంశాలు: ✦ పరిశ్రమలకు లైసెన్సు మంజూరు ✦ అవస్థాపన సౌకర్యాల ఏర్పాటు ✦ మూలధన సమీకరణ ✦ రాయితీలు ✦ ప్రోత్సాహకాలు ✦ పరపతి విధానం ✦ పారిశ్రామిక సంబంధాలు ✦ ఎగుమతులకు సంబంధించిన అంశాలు ✦ ఉద్యోగాల సృష్టి ✦ విదేశీ మారక నిబంధనలు

టీఎస్-ఐపాస్: తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రాజెక్టు అనుమతి, స్వయం ధ్రువీకరణ విధానం (TS-iPASS) విధానాన్ని 2015 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీన్ని పెట్టుబడుదారులకు అనుకూలంగా, పెట్టుబడులను పెద్ద మొత్తంలో ఆకర్షించేందుకు ఏర్పాటు చేశారు.

టీ - హబ్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఐఐఐటీ క్యాంపస్‌లో టీ-హబ్ పేరుతో నవ్యావిష్కరణల కోసం ఒక సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది సాంకేతికపరమైన స్టార్టప్‌లను అందించడం ద్వారా కొత్త పరిశ్రమలను ప్రోత్సహిస్తుంది. వాటికి అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్గదర్శకాలను సూచిస్తుంది. భిన్నమైన పరిశ్రమలను అనుసంధానం చేసేందుకు సహాయపడుతుంది. ఇందులో వ్యవస్థాపక భాగస్వాములైన ఐఎస్‌బీ, ఐఐఐటీ - హైదరాబాద్, నల్సార్ సంస్థలు ఈ సమగ్ర వ్యవస్థకు వ్యాపార సాంకేతిక, న్యాయ, నైపుణ్యాలను అందిస్తాయి. ప్రస్తుతం ఎడ్యుకేషన్, ఆరోగ్య సంరక్షణ, రిటైల్ రంగం, క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ అప్లికేషన్ టెక్నాలజీ విభాగాల్లో స్టార్టప్‌లు పురోగతి సాధిస్తున్నాయి. ద్వితీయశ్రేణి టీ - హబ్‌గా వరంగల్ పట్టణాన్ని గుర్తించారు.

రచయిత: బండారి ధనుంజయ

అంచులు వాలుగా... నేలలు ఎత్తుగా!

ఖనిజ నిల్వలు కలిగి, జలపాతాలతో అలరారుతూ మానవాళికి ఎనలేని మేలు చేస్తున్న భూస్వరూపాలు పీఠభూములు. ఈ నేలలు ఎక్కువ విస్తీర్ణంతో పరిసరాలకంటే ఎత్తుగా, సమతలంగా ఉంటాయి. అంచులు వాలుగా ఉండటం వీటి ప్రత్యేకత. జనరల్ స్టడీస్ ప్రశ్నల్లో రకరకాల పీఠభూములపై ప్రశ్నలు వస్తున్నాయి. అభ్యర్థులు వాటిపై స్థూలమైన అవగాహన పెంచుకోవాలి.

పీఠభూములు

అంచులు వాలుగా ఉండి, ఎక్కువ విస్తీర్ణంతో సమతలంగా ఉన్న భూభాగాన్ని పీఠభూమి అంటారు. ఇవి మూడు వందల మీటర్ల అంతకంటే కొద్దిగా ఎత్తుగా ఉంటాయి. కొన్ని పీఠభూముల అంచులు నిట్రవాలుగా ఉంటాయి. ఇలాంటి వాటిని టేబుల్ లాండ్స్ (బల్లపరుపు భూములు) అని పిలుస్తారు. పీఠభూముల ద్వారా ప్రవహించే నదుల లోయలు లోతుగా ఉంటాయి. నదుల క్రమక్షయం వల్ల ఇవి ఖండిత పీఠభూములుగా ఏర్పడతాయి. ప్రపంచంలోని ఎత్తయిన పీఠభూములన్నీ పర్వత నిర్మాణ క్రియతో పాటే ఏర్పడ్డాయి.

పీఠభూములు సాధారణంగా మూడు విధాలుగా ఏర్పడతాయి.

1) పర్వత మాలోద్భవం (వరుసగా ఆవిర్భవించిన)తోపాటు ఏర్పడిన పీఠభూములు
2) అగ్నిపర్వత క్రియ వల్ల ఏర్పడిన పీఠభూములు
3) శిథిలం కాకుండా మిగిలిన పురాతన కఠిన శిలలతో ఏర్పడిన ఎత్తయిన పీఠభూములు

మరిన్ని వివరాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

https://tinyurl.com/2p8afkda

✦ పర్వత మాలోద్భవంతోపాటు ఏర్పడిన పీఠభూములను మూడు రకాలుగా విభజించారు.

ఎ) పర్వతాంతర పీఠభూములు: ఇవి పర్వతాలతో పరివేష్టితమైన పీఠభూములు. వీటి వైశాల్యం చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రపంచంలోని ఎత్తయిన పీఠభూములన్నీ పర్వతాల మధ్యలోనే ఉన్నాయి. ఇవి ముడుత పర్వతాల ఆవిర్భావంతోపాటు ఏర్పడ్డాయి.

ఉదా: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన, అతిపెద్దదైన టిబెట్ పీఠభూమి, పామీర్ పీఠభూములు (వీటినే ప్రపంచ పైకప్పులు అని పిలుస్తారు), బొలీవియా, మంగోలియా, మెక్సికో పీఠభూములు.

బి) గిరిపద పీఠభూములు: ఇవి ముడుత పర్వతాల ఆవిర్భావంతోపాటు పర్వత పాదాల వద్ద ఏర్పడ్డాయి. వీటికి ఒకవైపు పర్వతాలు, మరొకవైపు సముద్రాలు/ సరస్సులు/ మైదానాలు సరిహద్దులుగా ఉంటాయి. అందుకే వీటిని సరిహద్దు పీఠభూములు అని కూడా పిలుస్తారు.

ఉదా: అమెరికాలోని కొలరాడో పీఠభూమి. ఇది రాళ్ళీ పర్వత పాదాలకు, బేసిన్ రేంజ్ ప్రావిన్స్‌కు మధ్య ఉంది. అర్జెంటీనాలోని పెటగోనియా పీఠభూమి.

సి) కలశ పీఠభూములు: భూఅంతర్భాగంలోని ఊర్ధ్వ బలాల వల్ల భూపటలంలోని కొంత భాగం కలశాకారంగా పైకి లేవడంతో ఇవి ఏర్పడతాయి.

ఉదా: అమెరికాలోని అర్కన్సాస్, ఓజార్క్ పీఠభూములు.

✦ అగ్నిపర్వత క్రియ వల్ల ఏర్పడిన పీఠభూములు రెండు రకాలు.

లావా పీఠభూములు: భూగర్భంలోని క్షార లావా భూఉపరితలానికి ప్రవహించి కుప్పగా పోగై విశాలమైన, ఎత్తయిన పీఠభూమిగా ఏర్పడుతుంది.

ఉదా: భారతదేశంలోని దక్కన్ పీఠభూమి, అమెరికాలోని స్నేక్‌రివర్, కొలంబియా పీఠభూమి, మాల్వా పీఠభూమి.

ఖండాంతర్గత పీఠభూములు: భూ అంతర్భాగంలోని ఊర్ధ్వ బలాల వల్ల మైదాన ప్రాంతం లేదా సముద్రభూతలం పైకి నెట్టుకురావడం వల్ల ఇవి ఏర్పడతాయి. దక్షిణాఫ్రికాలోని పీఠభూములు దీనికి ఉదాహరణ.

✦ శిథిలం కాకుండా మిగిలిన పురాతన కఠిన శిలలతో ఏర్పడిన ఎత్తయిన పీఠభూములు...

అవశిష్ట పీఠభూములు: భూఉపరితలంపై కొండలు, గుట్టలు వికోషీకరణ బలాల శైథిల్య, క్రమక్షయ చర్యలతో శిథిలమై ఈ పీఠభూములుగా పరిణామం చెందుతాయి.

ఉదా: మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ సరిహద్దుల్లో విస్తరించి ఉన్న బుందేల్‌ఖండ్ పీఠభూమి, మధ్యప్రదేశ్ ఈశాన్య సరిహద్దులోని బాగల్‌ఖండ్ పీఠభూమి (పన్నావజ్రపు గనులకు ప్రసిద్ధి), ఝార్ఖండ్‌లోని హజీరాబాద్, రాంచీ పీఠభూమి (కాపర్ నిల్వలకు ప్రసిద్ధి), కోడెర్మా పీఠభూమి (మైకా నిల్వలకు ప్రసిద్ధి), చోటానాగపూర్ పీఠభూమి (ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల సరిహద్దుల్లో విస్తరించి ఉంది. దీనినే రూర్ ఆఫ్ ఇండియా లేదా ఖనిజాల కాణాచి అని పిలుస్తారు).



మాదిరి ప్రశ్నలు

1. **ఆర్మీనియా పీఠభూమి ఎక్కడ ఉంది?**
1) ఆఫ్రికా 2) రష్యా 3) టిబెట్ 4) ఆస్ట్రేలియా

2. **టిబెట్, పామిర్ పీఠభూములు ఏ రకమైన పీఠభూములకు ఉదాహరణ?**
1) పర్వతాంతర 2) గిరిపద
3) కలశ 4) లావా పీఠభూములు

3. **అర్జెంటీనాలోని 'పెటగోనియా పీఠభూమి' ఏ రకానికి చెందింది?**
1) పర్వతాంతర 2) గిరిపద 3) కలశ 4) ఖండాంతర్గత

4. **పెటగోనియా పీఠభూమి ఏ ఖండంలో ఉంది?**
1) ఉత్తర అమెరికా 2) దక్షిణ అమెరికా 3) యూరప్ 4) ఆస్ట్రేలియా

5. **ప్రపంచంలో ఎత్తయిన పీఠభూమి?**
1) టిబెట్ 2) బొలీవియా 3) మంగోలియా 4) కొలరాడో

6. **'ప్రపంచపు పైకప్పు' అని ఏ పీఠభూమిని పేర్కొంటారు?**
1) పామీర్ 2) మాల్వా 3) దక్కన్ 4) కొలరాడో

సమాధానాలు: 1-3; 2-4; 3-2; 4-1; 5-4; 6-2.

రచయిత: సక్కరి జయకర్

సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాక్టీస్ బిట్లు

1. **జన్యు ఇంజినీరింగ్ సాంకేతికతలో ఉపయోగపడే ఏ ఎంజైమ్‌లను అణుకత్తెరలు అంటారు?**
1) న్యూక్లియోసైడేజ్‌లు 2) రైబోన్యూక్లియేజ్‌లు
3) రెస్ట్రిక్షన్ ఎండోన్యూక్లియేజ్‌లు 4) లైగేజ్‌లు

2. **జన్యు ఇంజినీరింగ్‌లో డీఎన్ఏ వాహకాలుగా పనిచేసేవి?**
1) ప్లాస్మిడ్‌లు 2) కాస్మిడ్లు
3) బ్యాక్టీరియోఫాజ్‌లు 4) అన్నీ

3. **బయోటెక్నాలజీలో వివిధ ప్రయోగాల కోసం డీఎన్ఏను వాటి పొడవు ఆధారంగా వేరుచేసే ప్రక్రియ?**
1) డీఎన్ఏ ఐసోలేషన్
2) అగారోజ్ జెల్ ఎలక్ట్రోఫోరోసిస్
3) సదరన్ బ్లాటింగ్
4) నార్తన్ బ్లాటింగ్

4. **క్లోనింగ్ ప్రయోగాల్లో ఏ కణాలను తీసి వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు?**
1) పిండస్థ మూలకణాలు
2) దేహ మూలకణాలు
3) హేమోపాయిటిక్ మూలకణాలు
4) నాడీ మూలకణాలు

5. **శిశువు నుంచి పెద్దవారి వరకు శరీరంలోని ఏ భాగాల నుంచి మూలకణాలను సేకరిస్తారు?**
1) కార్నియా2) దంతం 3) ఎముక మజ్జ 4) పైవన్నీ

6. **ఎముక మజ్జ నుంచి తీసిన మూలకణాలు ఏ రకమైనవి?**
1) అస్థి మూలకణాలు
2) హేమోపాయిటిక్ మూలకణాలు
3) బోన్ మూలకణాలు
4) అడిపోజ్ మూలకణాలు

సమాధానాలు: 1-3; 2-4; 3-2; 4-1; 5-4; 6-2.

వీడియో పాఠం
పోలీసు ఉద్యోగాలు
అరిథ్‌మెటిక్
నిష్పత్తి - అనుపాతం

విపత్తు నిర్వహణ బిట్లు

టీఎస్‌పీఎస్సీ ఇండియన్ పాలిటీ ఈ - బుక్

కరెంట్ అఫైర్స్

హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్‌గా జెన్నిఫర్

హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కాన్సుల్ జనరల్‌గా జెన్నిఫర్ లార్సన్ నియమితులయ్యారు. ఈ ఏడాది సెప్టెంబరులో ఆమె హైదరాబాద్‌కు వస్తారు. గతంలో భారత్ వ్యవహారాల డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీగా, ముంబయిలోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో డిప్యూటీ ప్రిన్సిపల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం వాషింగ్టన్ డీసీలో విధులు నిర్వహిస్తున్నారు.

జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా కొత్త జాతీయ రికార్డును నెలకొల్పాడు. ఫిన్లాండ్‌లో జరుగుతున్న పావో నుర్మి గేమ్స్‌లో రజతం గెలుచుకున్నాడు. 89.30 మీటర్ల త్రో చేసిన నీరజ్, తన పేరిటే ఉన్న జాతీయ రికార్డు (87.58)ను బద్దలు కొట్టాడు. 87.58 మీటర్ల విసిరి టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించాడు.

శ్రీలంక రాజధాని కొలంబోలో 'బిమ్స్‌టెక్' ఆధ్వర్యంలో సాంకేతికత బదిలీ కేంద్రం ఏర్పాటుకు ఉద్దేశించిన సహకార ఒప్పందానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 'బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ - సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (బిమ్స్‌టెక్)' సభ్య దేశాలు 2021 మార్చి 30న జరిగిన సదస్సులో ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి.

కోయంబత్తూరు నార్త్ నుంచి సాయినగర్ షిర్డీకి తొలి ప్రైవేటు రైలు 'దేఖో అప్నా దేశ్' పేరిట 2022 జూన్ 14న బయలుదేరింది. కేంద్రం 'భారత్ గౌరవ్' పథకం కింద ప్రవేశపెట్టిన తొలి ప్రైవేటు రైలు ఇదే. అయిదు రోజుల పాటు ప్యాకేజీ టూర్ కింద ఇందులో ప్రయాణించవచ్చని దక్షిణ రైల్వే తెలియజేసింది.

ఈ-బుక్స్